ANDHRAJYOTHY
# ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 1 జూన్ 2024

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 30.0

రైతుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్ళు చల్లింది. పశ్చిమ డెల్టాను పూర్తిగా విస్మరించింది. కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులు చేయకుండానే జూన్ 1న కాలువలకు నీళ్ళు విడుదల చేయనున్నారు. కేవలం 24 గంటల గడువు మాత్రమే మిగిలి ఉంది. కాలువలకు నీటి సరఫరా చేస్తే ఇక వేసవిలో పనులు చేసే అవకాశమే లేదు. ఏటా మార్చిలో కాలువల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపేవారు. అయినా ప్రభుత్వం స్పందించేది కాదు. నిధులు ఇవ్వకుండా తాత్సారం చేసేది. ఈసారి జిల్లా నీటి పారుదలశాఖ అధికారులు ముందుగానే మేల్కొన్నారు. జనవరిలోనే ప్రతిపాదనలు పంపించారు. ఎన్నికల ఏడాది కావడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అధికారులు ఆశించారు. కానీ ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. పైసా మంజూరు చేయలేదు.


భీమవరం వద్ద తూడుతో పూడుకుపోయిన యనమదుర్రు డ్రెయిన్

# రైతులకు కన్నీళ్లే..

## వేసవి పనులు చేయకుండానే.. నేడు కాల్వలకు నీటి విడుదల

- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- పొంచి వున్న ముప్పు.. రైతుల ఆందోళన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కాలువలు, డ్రెయిన్లకు మరమ్మతులు చేయకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరందడం లేదు. డ్రెయిన్లు ప్రవహించడం లేదు. నీటి ఎద్దడి ఎదురైతే సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక వర్షాలలో డ్రెయిన్లలో నీరు లాగకపోవడంతో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో రైతులు ఇటువంటి దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 25 వేల ఎకరాలలో సాగు చేయలేకపోతున్నారు. పంట విరామాన్ని ప్రకటిస్తున్నారు. పచ్చని పొలాలు బీడు వారుతున్నాయి. రైతు ప్రభుత్వం అంటూ వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెబుతూ కాలం గడిపేసింది. వేసవి పనులకే నిధులు ఇవ్వకుండా చుక్కలు చూపించింది.

### పక్కదారి పట్టిన నీటి తీరువా

రైతులు ఏటా నీటి తీరువాను చెల్లిస్తున్నారు. నీటి పన్నులు వసూలు చేయడానికి రెవెన్యూ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. రైతుల నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తోంది. ప్రభుత్వానికి జమ చేస్తుంది. అందులో 80 శాతం నిధులు కాల్వల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేయాలి. కాని, వైసీపీ ప్రభుత్వం నీటి తీరువా నిధులను దారి మళ్లించింది. వేసవి పనులకు నిధులు ఇవ్వడం లేదు. గతంలో ప్రజా ప్రతినిధులే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవారు. నీటి సంఘాలు చొరవ చూపేవి.

### • నీటి సంఘాలకు స్వస్తి



వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలకు స్వస్తి పలికింది. క్షేత్రస్థాయిలో నీటి సంఘాలు, నీటి పంపిణీ సంఘాలు ప్రాజెక్టు కమిటీలు ఉండేవి. వేసవి పనులను పూర్తి చేయడంలో నీటి సంఘాల ప్రతినిధులే కీలకంగా వ్యవహరించేవారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయినా వారే పనులు పూర్తి చేపట్టేవారు. తర్వాత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వరకు వున్న నీటి సంఘాలు రద్దు చేసింది. కొత్త సంఘాలు ఏర్పాటు చేయలేదు. కార్పొరేషన్లు అంటూ హడావుడి చేసింది తప్ప రైతులకు ప్రయోజనం కలిగించే నీటి సంఘాలను మాత్రం తుంగలో తొక్కింది. పంట కాలువలను డ్రెయిన్లను నిర్వహణలో అటకెక్కించింది. నీటిపారుదల శాఖలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, లస్కర్లకు వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేసింది. రైతులు చెల్లించే నీటి పన్నులు మాత్రం ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంది. నీటిపారుదల శాఖను పట్టించుకోని ప్రభుత్వంగా అపవాదును మూటకట్టుకుంది.

తమ పరిధిలో పనులను ప్రతిపాదించాలంటూ నీటిపారుదల శాఖ అధికారులకు సూచనలు చేసేవారు. గడిచిన ఐదేళ్లలో మచ్చుకైనా నీటిపారుదల శాఖ అధికారులకు సూచించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వం నుంచి స్పందనలేకపోయింది.

### రైతు ప్రభుత్వమంటే ఇదేనా ?

వేసవిలో కనీస మరమ్మతులు చేయని ప్రభుత్వంగా వైసీపీ ముద్ర వేసుకుంది. తొలి నుంచి ఇది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకుంది. కార్యాచరణలో తుస్సు మనిపించింది. పంట కాలువలను విస్మరించింది. కాంట్రాక్టర్లు గతంలో నీటిపారుదల శాఖ అధికారుల చుట్టూ తిరిగేవారు. టెండర్ల కోసం ఎదురు చూసేవారు. వైసీపీ ప్రభుత్వంలో పరిస్థితులు తల్లకిందులయ్యాయి. నీటిపారుదల శాఖ అంటేనే కాంట్రాక్టర్లు ముఖం చాటేస్తున్నారు. పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు. కొద్దో, గొప్పో పనులు చేస్తే బిల్లులు మంజూరు చేయడం లేదు. గడిచిన ఐదేళ్లుగా పశ్చిమ డెల్టాను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఒక్కసారి కూడా నీటిపారుదల శాఖ మంత్రి జిల్లాలో పర్యటించలేదు. ఇక్కడ రైతుల స్థితిగతులను చూడలేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేకపోయారు. సాగు నీటి సలహా మండలి జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరుకాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల కేటాయించదన్న ఉద్దేశంతో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల్లోనూ నిరుత్సాహం అలుముకుంది. దీంతో సాగు నీటి సలహా మండలి సమావేశాలకు గైర్హాజరయ్యారు. ప్రస్తుత వేసవిలో ప్రజా ప్రతినిధులంతా ఎన్నికలలో తలమునకలయ్యారు. దీంతో పంట కాలువలు, డ్రెయిన్లపై దృష్టి సారించే నాధుడే కరువయ్యాడు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం నిధులు మంజురు చేయకుండా చేయిచ్చింది.

### పొంచి ఉన్న ముప్పు

పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు రూ.37 కోట్ల విలువైన పనులు ప్రతిపాదించారు. తూడు, గుర్రపు డెక్క, పూడిక తొలగింపు, గట్లు పటిష్టత, లాకుల మరమ్మతు పనుల కోసం అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే టెండర్లు పిలవాలంటూ భావించారు. కాని, ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్ళు చల్లింది. అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. ఎన్నికల ఏడాది కూడా నిధులు ఇవ్వలేదంటే నీటి పారుదల శాఖపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోంది. అధిక వర్షాలు కురిస్తే డ్రెయిన్లు ప్రవహించక పంట పొలాలు ముంపు బారినపడే ప్రమాదం పొంచి ఉంది. ఏటా రైతులు ఇలా నష్టపోతున్నారు. పంట దెబ్బతిన్న రైతులకు బీమా ఇవ్వడం లేదు.

# మీరు సొమ్ములు పంపలేదు..!

- పోలింగ్ ముగిసినా ఎన్నికల ఫండ్ ఇవ్వాల్సిందే
- ఫోన్ చేసి పట్టుబడుతున్న నేత..



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆ నియోజకవర్గంలో వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు విరాళాలు ఇవ్వడం పరిపాటి. ఇది పోలింగ్ ముందు వరకు జరిగే తతంగం. ఆ తర్వాత పెద్దగా ఎవరూ పట్టించుకోరు. కాని, జిల్లాలోని వాణిజ్య పట్టణ కేంద్రంగా వున్న నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి చందాల కోసం ఇప్పటికీ వ్యాపారులను వేటాడుతున్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుంచి కోటి రూపాయులు ఇవ్వాలని హుకుం జారీచేశారు. అయితే అసోసియేషన్‌లో ఒక రైస్‌మిల్లర్ వైసీపీ నుంచి బయటకు వచ్చేసి జనసేనలో చేరడంతో కోటి చందాకు గండి పండింది. పట్టణ శివార్లలోని ఒక రిఫైనరీ కంపెనీ నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారు. నియోజకవర్గంలోని వ్యాపారులకు ఫోన్ చేసి విరాళాల టార్గెట్లు విధించారు. ఎన్నికల ముందే పలువురు సొమ్ములు ఇచ్చేశారు. బంగారు వర్తకుల సంఘం చందాలు ఇవ్వకపోవటంతో ఇప్పుడు ఆ నేత, నాయకులు వారికి పదే పదే ఫోన్‌లు చేస్తున్నారు. ఎన్నికలు ముగిసి రోజులు గడచిపోతున్నా చందాలు కోసం పట్టుపడితే అధికార పార్టీ అభ్యర్థి చూసి అంతా విస్తుపోతున్నారు.

# నేడే ఎగ్జిట్ పోల్స్

- ఏడు సీట్లు తమవేనంటూ కూటమి అంచనా..




(భీమవరం-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శనివారం సాయంత్రంతో ముగుస్తుండడంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది ? ఎవరు ఎన్ని స్థానాలు సాధిస్తారు ? అనే అంశంపై పలు సర్వే సంస్థలు పోలింగ్ రోజు సర్వే చేసి ఫలితాలను వెల్లడిస్తారు. ఒక్కోసారి ఇవి కరెక్ట్‌గా ఉంటాయి. కాబట్టి వీటిని ఎక్కువ శాతం మంది నమ్ముతారు. బెట్టింగులపైన వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే గెలుపుపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఒక స్పష్టతతో, మంచి జోష్‌తో వుంది. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లను కూటమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తూ పందేలకు కాలు దువ్వుతున్నారు. తాడేపల్లిగూడెంలో ఒకటికి నాలుగు రెట్లు సొమ్ములు ఇస్తామంటూ అధికార పార్టీకి కూటమి నాయకులు వర్తమానం పంపారు. రెండు కోట్ల వరకు పందెం ఉందంటూ సంకేతాలు ఇచ్చారు. వైసీపీ నేతలు తొలుత సిద్ధపడినా చివరి దశలో సొమ్ములు లేవంటూ వెనక్కు తగ్గారు. జిల్లాలో ఒక్క పందెం కూడా జరగని నియోజకవర్గం ఉందంటే అది గూడెం ఒక్కటేనని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలో మరిన్ని పందేల కోసం.. ఎగ్జిట్ పోల్స్ కోసం పందెంరాయుళ్లు ఎదురుచూస్తున్నారు.

ఈ నెల నాలుగో తేదీ ఎన్నికల ఫలితాలు విడుదలైనప్పటి నుంచి 6వ తేది వరకు గెలుపొందిన అభ్యర్థులు ఎలాంటి ర్యాలీలు, సంబరాలు చేసుకోరాదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అలాగే 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలను మరుసటి రోజు కౌంటింగ్ పూర్తయ్యే వరకు జిల్లాలో మద్యం షాపులు, బార్లు మూసివేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఫలితాలు అనంతరం తిరిగి షాపులు తెరుచుకుంటాయి.

# అమ్మో.. జూన్

## ఈ నెలంతా ఖర్చులే.. గడిచేదెలా

- పిల్లల చదువులు.. సార్వాకు పెట్టుబడులు
- విద్యార్థులకు భారంగా ఫీజులు, ఇతర ఖర్చులు
- రైతులకు ఇంకా అందని ధాన్యం సొమ్ములు

జూన్ నెల వస్తుందంటేనే అన్ని వర్గాల ప్రజల్లోను అదనపు ఖర్చుల భారం వెంటాడుతోంది. ఈ మాసంలో స్కూల్స్ తెరుస్తారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం అప్పుల వేట ప్రారంభించాయి. వ్యవసాయ సీజన్ మొదలయ్యే మాసం కావడంతో రైతులు విత్తనాలు, భూముల దుక్కులు, ఇతర పెట్టుబడుల సొమ్ముల కోసం బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జూన్ నెలకు స్వాగతం పలకాలంటే సామాన్య మధ్యతరగతి ప్రజలు హడలిపోతున్నారు.

పాలకొల్లు, మే 31: జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కార్మికులు, కర్షకులు, చిరుద్యోగులు, సామాన్య, మధ్యతరగతి వర్గాలు ఇలా పేదా గొప్ప తేడా లేకుండా తాము ఎంత కష్టపడైనా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఫీజులతో సంబంధం లేకుండా మంచి స్కూల్స్‌నే ఎంపిక చేస్తున్నారు. ఇప్పుడు నర్సరీకి చిన్న తరహా కాన్వెంట్‌లో రూ.30 వేలు, కార్పొరేట్ స్కూలులో రూ.లక్ష ఖర్చవుతున్నది. తరగతులు పెరిగే కొద్దీ ఈ ఫీజులు మరింత పెరుగుతాయి. ప్రస్తుత తరగతి నుంచి పైతరగతికి వెళ్లే పిల్లల ప్రవేశానికి ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫామ్, బెల్టులు, బూట్లు, బ్యాగులు, ఇతర స్టడీ మెటీరియల్‌కు రూ.50 నుంచి లక్ష వరకు కావాలి. సగటు వేతన జీవులైతే తమ పిల్లలకు మంచి చదువుల కోసం టెక్నో, ఐఐటీ అకాడమీ అంటూ ప్రచారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు అప్పుల పాలవుతున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీతోపాటు ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్ల కోసం లక్షల్లోనే ఫీజులు చెల్లించాల్సిందే. పిల్లల చదువుల విషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. మొత్తంగా జూన్ మాసంలో పేద కుటుంబాల తల్లిదండ్రుల పరిస్థితి దయనీయంగా మారుతుంది.



### భారంగా పిల్లల ఫీజులు



■ మా అబ్బాయి, అమ్మాయి 1, 4 తరగతులు చదువుతున్నారు. వారికి మంచి చదువు చెప్పించాలనే ఉద్దేశంతో ఫీజులు భారమైనా కాన్వెంట్‌లో వేశా. నేను చేస్తున్న చిరుద్యోగం ద్వారా నెలకు రూ.12 వేలు ఆదాయం వస్తుంది. పిల్లలకు ఫీజులు కట్టడానికి కొన్ని సందర్భాల్లో నెలకు రూ.3 వడ్డీకి తెస్తున్నాను. విద్య, వైద్యం పూర్తిగా ఉచితం చేసి ప్రభుత్వమే ఆ ఖర్చులు భరిస్తే మాలాంటి పేదలు సైతం పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వగలుగుతాం.

- శిడగం సతీష్, పాలకొల్లు

### ధాన్యం సొమ్ములు రాక..



■ ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ సొమ్ములు రాలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. జూన్‌లో సార్వా మొదలుపెట్టాలి. సాగుకు సొమ్ములు లేక ఇబ్బంది పడుతున్నా. ఏరువాక అనేది రైతులకు ముఖ్యమైనది. ఈ ఏడాది ఆదిలోనే ఇన్ని కష్టాలు పడుతున్నాం.

- కడలి ఆంజనేయులు, రైతు, పెనుమదం

### ఏరువాక సాగేనా..

రైతుల పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. ఏరువాక ఆరంభం నుంచి రైతు వడ్డీకి తెచ్చిన సొమ్ముతోనే సాగు మొదలవుతుంది. ప్రకృతి కరుణించి పంట చేతికి వచ్చి ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియదు. సాగు ఆరంభం నుంచి పెట్టుబడి పెట్టిన రైతుకు పంటను మార్కెట్‌కు తరలించినా సొమ్ము చేతికి రాని పరి స్థితి. దాళ్వా మాసూళ్లు పూర్తయ్యి, ధాన్యం ఆర్బీకేలకు తరలిం చినా ఇప్పటికీ అధిక శాతం రైతులకు సొమ్ములు అందలేదు. మరోవైపు సార్వా సాగుకు సమాయత్తం కావాల్సిన పరిస్థితి. నేటి రైతు పరిస్థితి 'ఆరుగాలం శ్రమ - ఆదాయం భ్రమ' అన్న రీతిన తయారైంది. దీంతో రైతులు సాగంటేనే మక్కువ చూపడం లేదు. సార్వా పండించిన పంట చేతికి వస్తుందో రాదో తెలియదు. పంట చేతికిచ్చినా సొమ్ములు ఎప్పుడు వస్తాయో అర్థం కాదు. ఈ పరిస్థితుల్లో నూతన పనలీ ఆరంభమైనా రైతులు మునుపటి ఉత్సాహాన్ని చూపించడం లేదు.



### జై.. హనుమాన్

నేడు హనుమాన్ జయంతి. జిల్లాలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. కలిదిండిలో 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ఏలూరు సిటీ, మే 31 : ఓ వైపు ఎండలు, మరోవైపు విద్యుత్ కోతలతో జనం విలవిల్లాడుతున్నారు. విద్యుత్ సరఫరాకు సరిపడినంత కోటా వచ్చినా తారస్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయిస్తాయి. సాంకేతికపరమైన ఇబ్బందులతో శుక్రవారం ఎక్కడికక్కడ కోతలు పెరిగాయి. ప్రచండ భానుడి ప్రతాపంతో విపరీతంగా ఉక్కపోత పెరిగింది. బయటకు వెళితే ఎండ తీవ్రత, ఇంట్లో ఉంటే విద్యుత్ కోతలకు తాళలేక ప్రజలు ఇబ్బందులు మిగతా 8వ పేజీలో..

# విద్యార్థుల ఎదురుచూపు

- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలలో జాప్యం
- మొన్నటి వరకు ఎన్నికలు.. ఇప్పుడు అధికారుల సెలవులు
- పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు విద్యార్థుల దరఖాస్తులు
- గ్రామ, వార్డు సచివాలయాల ప్రాసెస్ ఆలస్యం

భీమవరం ఎడ్యుకేషన్, మే 31 : పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ వంటి కోర్సుల్లో చేరేందుకు కొద్ది రోజుల్లో కౌన్సెలింగ్ మొదలు కానున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లు తీసుకునేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారు. వీటినిచ్చే అధికారులు మొన్నటి వరకు పోలింగ్ హడావుడిలో ఉండగా, ఇప్పుడు కొందరు సెలవుల్లో ఉన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కొన్ని రోజులుగా ఎదురుచూపులుగా మారింది. కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కొన్ని రోజులుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులు కుప్పలుగా కనిపిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు రోజులు ఆపై వారం రోజుల్లో విద్యార్థులకు అందాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 10 రోజులు దాటినా అందలేదు. ఒక కార్యాలయంలో తహశీల్దార్ సెలవులో ఉండటం వల్ల ఆ పని వేరే వాళ్లకు అప్పగించనందున మొన్నటి వరకు రోజుల ప్రక్రియ పత్రాలపై తహశీల్దార్ సంతకం అవ్వక దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. రెండు రోజుల నుంచి తహశీల్దార్ విధులలోకి రావడం వలన సర్టిఫికెట్స్ కదులుతున్నాయి. ప్రస్తుత పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ జరుగుతున్నందున ఆ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఒత్తిడిగా మారింది.



### ■ ఆధార్ అడ్డంకులు

ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు ఆధార్ అడ్డంకులతో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారు. పదేళ్ల క్రితం స్వగ్రామంలో ఆధార్ నమోదు చేయించుకున్న కుటుంబం తర్వాత ఉపాధి, పిల్లల చదువుల నిమిత్తం పట్టణ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారి రేషన్ కార్డు, ఓటరు కార్డు, బ్యాంక్ ఖాతాలు పట్టణంలోనే ఉన్నాయి. దీనికితోడు పదేళ్లుగా పిల్లల చదువులు పట్టణ విద్యా సంస్థలలో సాగింది. ఉన్నత చదువులకు అవసరమైన కుల, ఆదాయ పత్రాల కోసం దరఖాస్తు చేస్తే పదేళ్ల నాటి ఆధార్ కార్డు చూసి అధికారులు అవస్థలకు గురిచేస్తున్నారు. ఆధార్ అడ్రస్ ప్రూఫ్ కానే కాదని ఉన్నతాధికారులు చెబుతుంటే, కింది స్థాయి అధికారులు అదే అడ్డంకిగా ధ్రువీకరణ పత్రాల జారీలో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఆధార్ అడ్డంకుల సమస్యతో తణుకులో ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్నారు.

### ■ ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదు ?

విద్యార్థులు ఉన్నత చదువులకు ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదని అధికారులు సెలవిస్తున్నారు. ఇది ప్రభుత్వ నిర్ణయమని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశ పరీక్షలకు, ప్రవేశాలకు ఆదాయ ధ్రువీకరణ అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించిందని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల ప్రవేశాలకు అవసరమంటే సంబంధిత దరఖాస్తులు పరిశీలించి ఆదాయ ధ్రువీకరణ అందజేస్తున్నారు. ఏపీఈఏపీసెట్, డిగ్రీ ప్రవేశాలకు ఆదాయ ధ్రువీకరణ అవసరం లేదని చెబుతున్నారు. నీట్, తదితర కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పరీక్షలు, ప్రవేశాలకు అవసరమైతే రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

### వేలాది మందికి ధ్రువీకరణ పత్రాలు

పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఈ సమయంలో ఆదాయ ధ్రువీకరణ, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్స్ అవసరం కావడంతో అవి ఇచ్చే అధికారులు అందుబాటులో లేకపోతే విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 10,510 మంది ఇంటర్ పూర్తి చేసి తదుపరి కోర్సుల్లో చేరడానికి పదో తరగతి పూర్తి చేసుకున్న 17,007 విద్యార్థులు పాలిటెక్నిక్ ఇతర కోర్సులలో చేరడానికి వెళ్లే ముందు వారికి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలతోపాటు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్స్ అవసరం. చాలా మంది ఇప్పటికే దరఖాస్తు చేసుకోగా అధికారులు అందుబాటులో ఉండటం తప్పనిసరి.

### సచివాలయంలో దరఖాస్తుతో ఇబ్బందులు

వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థులకు సాయం ఎలా ఉన్నా ఒత్తిడి పడేలా చేస్తున్నాయని చెబుతున్నారు. గతంలో ఈ సేవ కేంద్రాల్లో ఆదాయ, కుల, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్స్ విద్యార్థులు దరఖాస్తు చేసుకుని పొందేవారు. సచివాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని ఏ ప్రాంతం వారైతే ఆ ప్రాంతంలోని సచివాలయాల్లో పొందాలని వైసీపీ ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు అవస్థలను తెచ్చిపెట్టింది. జిల్లాలో 403 సచివాలయాలు గ్రామాల్లో వున్నా, పట్టణాలలో ఉండి చదువుకునే విద్యార్థులు వారి గ్రామానికి వచ్చి దరఖాస్తు చేసుకోవడం ఇబ్బందిగానే ఉందని అంటున్నారు. దానికి తోడు సర్టిఫికెట్స్ అనుకున్న సమయానికి అవ్వకపోవడం వలన పలుమార్లు సచివాలయాలు చుట్టూ తిరగడం దూర ప్రాంతాల నుంచి రావడం ప్రస్తుత విద్యార్థులకు పెద్ద పనిగా మారింది.


ఏలూరు పాత బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మానుష్యం


జీలుగుమిల్లిలో నిర్మానుష్యంగా సెంటర్


పాలకొల్లులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు


ఉండిలో..

# భానుడి భగభగలు

- పెరిగిన వడగాల్పులు.. నిర్మానుష్యంగా రోడ్లు
- ఎండ తీవ్రతతో తల్లడిల్లిన జనం

ఏలూరుసిటీ, మే 31: భానుడి భగభగలు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచే కొనసాగాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు నగరంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాలలో ప్రధాన రహదారులపై జన సంచారం పూర్తిగా తగ్గింది. ఏలూరు నగరంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ ఎండ వేడిని తట్టుకోలేకపోయామని పలువురు చెబుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే వడగాడ్పుల తీవ్రత కొనసాగింది. గాలిలో తేమ 48 శాతం వరకు నమోదు కావడంతో ఉక్కపోత విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. వడగాడ్పుల తీవ్రతకు జనం అల్లాడిపోయారు. చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు వర్ణనాతీతం. రోహిణి కార్తెలో వారంరోజులుగా ఎండ ప్రభావం కనిపిస్తూనే ఉన్నా గురువారం నుంచి ఎండ తీవ్రత మరింత పెరిగింది. రోహిణి కార్తె ప్రభావం ఇంకా కొన్ని రోజుల పాటు ఉంటుందని, నైరుతి రుతుపవనాలు వచ్చే వరకు ఎండ తీవ్రతలు తప్పేలా లేవని భావిస్తున్నారు. జూన్ మొదటి వారంలో రుతుపవనాలు వస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ చెబుతోంది. వాతావరణం చల్లబడుతుందేమోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గ్రీష్మ తాపం ఎక్కువగా ఉండడంతో ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, కొబ్బరి బొండాల షాపులు, పండ్ల రసాల షాపులు, బటర్‌మిల్క్, సుగంధి, లస్సీ దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది.

### పనిచేయని ఏసీలు..

ఎండ తీవ్రత విపరీతంగా పెరుగుతుండటం, దానికి తగ్గట్టుగా విద్యుత్ కోతలు ఉండడంతో ఎండ సమయంలో ఏసీలు పనిచేయక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లో-ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏసీలు పనిచేయడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

### రోడ్లు నిర్మానుష్యం

ఆకివీడు/తణుకు/ పోలవరం/ ఉండి/ పాలకొల్లు అర్బన్/ ఆచంట/ అత్తిలి/ జీలుగుమిల్లి/ చింతలపూడి, మే 31 : ఆకివీడు, ఆచంట, అత్తిలి, జీలుగుమిల్లి, చింతలపూడి మండలాల్లో శుక్రవారం ఉదయం పదకొండు గంటల నుంచే జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. తణుకు రాష్ట్రపతి రోడ్డుతో పాటు ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పోలవరం మండలంలో వడగాల్పులతో పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో కొంతమంది ఇళ్లల్లో ఉండలేక చెట్ల కింద తలదాచుకున్నారు. మరికొంతమంది సినిమా థియేటర్‌లకు చేరి సేద తీరారు. వ్యాపార వాణిజ్య సంస్థలు వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఉండి పెద్ద వంతెన సెంటర్ బోసిపోయింది. బస్టాండ్ నిర్మానుష్యంగా మారింది. పాలకొల్లులో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. గంట గంటకు విద్యుత్ కోతలతో ప్రజలకు అవస్థలు తప్పలేదు.

# మేమేం పాపం చేశాం..!

- ఎండల్లో అంగన్‌వాడీ చిన్నారుల పాట్లు
- గర్భిణులు, బాలింతల పరిస్థితి మరింత దారుణం
- కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలంటూ డిమాండ్
- ఇంటివద్దకే పోషకాహారం అందించాలని విజ్ఞప్తి


దెందులూరులో అంగన్వాడీ కేంద్రం నుంచి ఎండలో నడిచి వెళ్తున్న చిన్నారులు

దెందులూరు, మే 31 : ఎండదెబ్బకు పెద్దలే భయపడిపోతుంటే ఉన్నతాధికారుల తీరుతో అంగన్‌వాడీ చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలు, వృద్ధులు ఉదయం తొమ్మిది గంటలు దాటిన తర్వాత ఆరు బయటకు రోడ్డు మీదకు తిరగవద్దని పదే పదే డాక్టర్లు అధికారులు సూచిస్తున్నప్పటికీ పిల్లల విషయంలో మాత్రం అధికారులకు కనికరం ఉండడం లేదు. వేసవి ఎండల దెబ్బకి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. కానీ అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, సహాయకులు పిల్లలు చేసుకున్న పాపమేంటో తెలియదు. వారికి మాత్రం సెలవులు ఇవ్వకుండా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో ఎండకు చిన్నారులు ఇబ్బందులకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 18 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 3,889 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి ఐదేళ్ల వరకు చదివే చిన్నారులు 1,70,698 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు 44,123 మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం కేంద్రాల నిర్వహణ తీరు పూర్తిగా మారింది. ఈ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ఏర్పాటు చేసి విద్యను నేర్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సంవత్సరం అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,185 మంది విద్యనభ్యసించి నూతన విద్యా సంవత్సరంలో బయటకు వెళ్లగా ప్రభుత్వ పాఠశాలలో 14,079 మంది చేరగా, ప్రైవేటు పాఠశాలల్లో 6,108 మంది చేరారు. దెందులూరు మండలంలో గతంలో కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బంది పడే వారు. ఇప్పుడు దాదాపు 90 శాతం పైగా నూతన హంగుల నిర్మించిన భవనాలలో చక్కటి వాతావరణంలో అంగన్వాడీ చిన్నారులకు విద్యను అందిస్తున్నారు.

### పౌష్టికాహారాన్ని ఇళ్లకు పంపి సెలవులు ఇవ్వొచ్చు..

మండుతున్న ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు రావడం అనేది సరైనది కాదని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రాకుండా బియ్యం, సరుకులు, పాలు, గుడ్లను ఇళ్లకు పది రోజులకోకసారి పంపిణీ చేసేవారు. ఆ మాదిరిగా ఎండలు తగ్గే వరకు సెలవులు ఇచ్చి పోషకాహారాన్ని అందించాలని చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.

# ఎండలో బతుకు వేట

- చిరువ్యాపారులకు తప్పని వెతలు

గణపవరం, మే 31 : నిప్పులు చెరుగుతున్న రోహిణి కార్తె ఎండల్లో చిరువ్యాపారులు దినసరి కూలి కోసం బతుకువేట ప్రారంభించారు. ఉదయం ఏడు గంటలు దాటితే కాలు బయటపెట్టడం చాలా కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రహదారుల వెంబడి చిరువ్యాపారాలు చేసుకునే వారి అవస్థలు వర్ణనాతీతం. మామిడి, తాటిముంజలు, నిమ్మకాయలు, బొప్పాయి, చేపలు, రొయ్యలు, తాటిబెల్లం, కొబ్బరిబొండాలు, తదితర కూరగాయలతో పాటు తోపుడుబళ్లపై కూడా పలు రకాల విక్రయించుకునే వారిని చూస్తే జాలిపడక తప్పదు. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు తమ బతుకు బండిని నడిపించేందుకు రోడ్కెక్కాల్సి వస్తుంది. మండుటెండలు లెక్కచేయకుండా గణపవరం నుంచి ఏలూరు రహదారిలో బొబ్బిలి వంతెన ఇరువైపుల నుంచి గణపవరం, తాడేపల్లిగూడెం రహదారిలో వెళ్లే రహదారుల వెంబడి చిరువ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. ముఖ్యంగా మండుటెండల్లో మెట్ట ప్రాంతాల నుంచి డెల్టా ప్రాంతాల నుంచి ఆటోలు, వ్యాన్‌లు లేదా బస్సుల్లో వచ్చి సరుకులు తెచ్చి విక్రయిస్తున్నారు. ఇవి విక్రయిస్తేనే కానీ దినసరి కూలి గిట్టడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎండైనా వానైనా అమ్మాల్సిందే..

ఎండ తీవ్రతను లెక్కచేయక తప్పదు. కూరగాయాలు విక్రయించకపోతే ఎండకు పాడైపోతాయి. పొట్ట నింపుకోవడానికి ఎండలో విక్రయాలు చేస్తున్నాం. ఎండొచ్చిన, వానొచ్చిన బత కాలంటే రోజుకు రూ.800 వరకు కూలి వచ్చేలా ఈ బళ్లపై వ్యాపారం తప్పనిసరి.



- చేగొండి సుబ్బయ్య, కూరగాయల వ్యాపారి

### పొట్టకూటి కోసం తప్పదు

తాటిముంజల సీజన్‌లో ఇక్కడకు వచ్చి అమ్ముతుంటాం ఎండ తీవ్రంగా ఉన్న వ్యాపారం చేయక తప్పదు. నీలాద్రిపురం, దూబచర్ల తదితర మెట్ట ప్రాంతాల నుంచి మోటారు సైకిళ్లపై ముంజలు తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నా. డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నా. కూలి గిట్టుబాటు కావడం లేదు.

- వీరన్న, తాటిముంజలు వ్యాపారి, నీలాద్రిపురం



## డీసెట్‌లో నిడమర్రు మండల విద్యార్థినులకు స్టేట్ ర్యాంకులు

- మీనాక్షికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు.. సునీతా హస్వినికి 13వ ర్యాంకు


మీనాక్షి, సునీతాహస్విని

నిడమర్రు, మే 31 : డీఈడీ ప్రవేశపరీక్ష డీసెట్-2024 ఫలితాలలో నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామానికి చెందిన కేశన మీనాక్షి రాష్ట్రస్థాయిలో భౌతిక శాస్త్ర విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించింది. విద్యార్థిని తండ్రి సూర్యచంద్రరావు వ్యవసాయ కూలీ, తల్లి సునీత గృహిణి. స్థానికంగా గల పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ప్రస్తుతం పామర్రు ప్రగతి కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తన ఈ ర్యాంకు రావడానికి కారణం ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు గైడ్ టీచర్‌గా ప్రోత్సహించినట్టు తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే ధ్యేయంగా పేర్కొంది.

### నిడమర్రు విద్యార్థిని హస్వినికి 13వ ర్యాంకు

నిడమర్రు గ్రామానికి చెందిన కన్నాజి సునీతా హస్విని డీసెట్-2024 ఫలితాలలో గణిత విభాగంలో రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకు సాధించారు. ఆమె నిడమర్రు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసి, గణపవరం చాణక్య కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. విద్యార్థిని తండ్రి సత్తిబాబు వ్యవసాయం కుటుంబానికి చెందిన వారు. హస్వినికి ఉత్తమ ర్యాంకు పట్ల గ్రామంలో పలువురు అభినందించారు.

## ఉత్తమ పోస్టుమాస్టర్‌గా గొట్టాపు శ్రీనివాస్


ఉత్తమ పోస్టుమాస్టర్‌గా అవార్డు అందుకుంటున్న గొట్టాపు శ్రీనివాస్

ఉంగుటూరు, మే 31 : విజయవాడ రీజియన్‌లో ఉత్తమ సేవలందించిన ఉంగుటూరు పోస్టుమాస్టర్ గొట్టాపు శ్రీనివాస్ విశాఖలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్టు శుక్రవారం తెలిపారు. 2023-24 ఏడాదికి గాను ఉత్తమ సేవల నేపథ్యంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు పోస్టుమాస్టర్ గొట్టాపు శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. ఉత్తమ పోస్టుమన్‌గా ఉంగుటూరు పోస్టాఫీసులో పనిచేస్తున్న షరీఫ్ అవార్డును అందుకున్నారు. గ్రామంలో పోస్టాఫీసు ద్వారా నోటరీ స్టాంపులు, రికరింగ్ డిపాజిట్ల ఖాతాలు పెద్దఎత్తున ప్రారంభించడంతో పాటు ఆధార్ కార్డులకు ఫోన్ నెంబర్లు లింక్ చేయడం, గ్రామీణ తపాలా లక్ష్యాలపై వీరి సేవలను గుర్తించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏపీ పోస్టల్ సర్కిల్ సీపీఎంజీ ప్రకాశ్, విజయవాడ రీజియన్ పీఎంజీవీఎస్ఆర్ మూర్తి తనకు పురస్కారం అందించారని పోస్టుమాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## ఓపెన్ స్కూల్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 'పాస్ గ్యారెంటీ' ఆఫర్ ?!

- డీఈవోకు పీడీఎస్‌యూ జిల్లా నాయకుల ఫిర్యాదు

ఏలూరు ఎడ్యుకేషన్, మే 31 : ఓపెన్ స్కూల్స్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నందున పకడ్బందీగా నిర్వహించాలని అభ్యర్థిస్తూ డీఈవో అబ్రహంకు శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి/ఏప్రిల్ నెలల్లో జరిగిన రెగ్యులర్ పరీక్షలకు జిల్లాలోని కొన్ని అక్రిడిటేషన్ ఇనిస్టిట్యూట్(పాఠశాల/కళాశాల)ల యాజమాన్యాలు పాస్ గ్యారెంటీపేరుతో ఇంటర్ పరీక్షార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని ఆరోపించారు. కొందరు అభ్యర్థులు పాస్ గ్యారెంటీకి ఆశపడి రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు ఏఐ కేంద్రాల యాజమాన్యాలకు చెల్లించారని వివరించారు. ఈవిధంగా అక్రమంగా వసూలుచేసిన డబ్బులకు రశీదులు ఇవ్వకుండా విద్యార్థుల నుంచి ఫోన్ పే, నగదు రూపంలో వసూలు చేసి మోసం చేశాయని ఆరోపించారు. రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు తాజాగా నిర్వహిస్తోన్న సప్లిమెంటరీ పరీక్షల్లో మిగిలిన సబ్జెక్టులు పాస్ కావాలంటే తాము డిమాండ్‌చేసిన డబ్బులు ఇవ్వాల్సిందేనని మళ్ళీ డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. ఇటువంటి యాజమాన్యాల చేతిలోపడి సప్లిమెంటరీ పరీక్షార్థులు మరో దఫా మోసపోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. డీఈవోను కలిసిన పీడీఎస్‌యూ నాయకుల్లో రేవంత్ తదితరులున్నారు. పీడీఎస్‌యూ నాయకుల ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ వర్గాలను వివరణ కోరగా.. ' ఓపెన్ స్కూల్స్ రెగ్యులర్ పరీక్షల్లో పాస్‌గ్యారెంటీ అంటూ కొందరు విద్యార్థులు ఏఐ కేంద్రాల యాజమాన్యాలకు డబ్బులు ఇచ్చి మోసమోయినట్టు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే సంబంధిత యాజమా న్యంపై చర్యలు తీసుకుంటామని బహిరంగ ప్రకటనలు ఇచ్చినా ఇంతవరకు ఒక్కరూ ముందు కురాలేదు. ఇపుడైనా ఫిర్యాదుచేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## అలరించిన మూడు నాటికలు

- రెండో రోజు జాతీయస్థాయి నాటిక పోటీల ప్రదర్శన


'రైతే రాజు', 'మనస్విని' నాటికల్లో సన్నివేశాలు

భీమవరం అర్బన్, మే 31 : చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్ఆర్ ఇంగ్లీషు స్కూల్ ఆవరణంలో జరుగుతున్న 17వ జాతీయస్థాయి సాంఘిక నాటికోత్సవాలో రెండో రోజు శుక్రవారం రాత్రి మూడు నాటికల ప్రదర్శనలు అలరించాయి. తొలుత జాతీయస్థాయి నాటిక పోటీల జ్యోతి ప్రజ్వలనను లయన్స్ చిలుకూరి కృష్ణంరాజు, గోకరాజు పాండు రంగరాజు ప్రారంభించారు. నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, చైతన్య భారతి కార్యదర్శి మంతెన రామ్‌కుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పేరిచర్ల లక్ష్మణవర్మ, బి.రాంబాబు, నాటిక పోటీలను పర్యవేక్షించారు..

### 'రైతే రాజు' నాటిక

దేశం వెలుపల జవాన్.. దేశంలో కిసాన్ వీళ్లు లేకపోతే ప్రజలు సుఖంగా బతకడం కష్టం అందుకే జైజవాన్.. జైకిసాన్..అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి పిడికెడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్ని శాసిస్తున్నారు. సెల్‌ఫోన్ లేక పోయిన బతకవచ్చు కానీ రైతు పండించే అన్నం తినకుండా భూమ్మీద ఎవరూ బతకలేరు. అటువంటి రైతులు ఈ రోజును రోడ్డున పడితే వారి కష్టాలు ఎవరికి కన్పించడంలేదని రైతు కష్టాన్ని ప్రేక్షలకు కళ్లకు కట్టిన్నట్టు చూపించిన నాటిక రైతే రాజు' నాటిక ఈ నాటిక రచన కంచర్ల సూర్యప్రకాష్, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించగా నటీనటులు తమ నటనతో నాటికను మరింత రసరమ్యంగా అలరించారు.

### 'మనస్విని' నాటిక

డబ్బే ప్రధాన మంటున్న ఈ రోజుల్లో మానవ సంబంధాల్లోని, మానవీయ విలువల్ని, ఉన్నత సంస్కారాన్ని ఆదర్శాన్ని ఆవిష్కరిస్తూ డబ్బుకన్నా మానవ సంబంధాలే ఎంతో ఉన్నతమైనవని తెలిపిన నాటిక ఆరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి మనస్విని నాటిక, చన వల్లూరు శివప్రసాదు, మూలకథ పోత్తూరి విజయలక్ష్మి, దర్శకత్వం గంగోత్రి సాయి నాటికను రక్తి కటించారు.

### 'విముక్తి' నాటిక

సమాజాన్ని ముందుండి నడిపించాల్సిన యువత ఈ రోజున గంజాయి, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని. మత్తు పదార్థాల నుంచి యువతను రక్షించి దేశాన్ని కాపాడుకుందాం అనే కథా సారాంశంతో సాగిన నాటిక ఉషోదయ కళానికేతన్ కత్రపాటు వారి విముక్తి నాటిక.

## 15 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి

ఏలూరు క్రైం, మే 31 : ఏలూరు రేంజ్‌లో ఉన్న ఏఎస్‌ఐలలో 15 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు వీరికి పదోన్నతులు కల్పించారు. కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్ఐ ఆర్ఎస్ రంగనాధరావుకు ఎస్ఐగా పదోన్నతి కల్పించి పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించారు. కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణను ఏలూరు జిల్లాకు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పనిచేస్తున్న బి.వెంకటేశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లాకు, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న డీవీ రమణ, ఎం.వెంకటేశ్వరరావులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కేటాయించగా కేవీ కృష్ణారావు, ఎం.శ్రీధర్, డీఎం శర్మ, అబ్దుల్ ఖరీమ్‌లను తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించారు. ఎం.డి. నజీర్‌ఖాన్, సీహెచ్ నరసింహారావు, పి.వెంకటేశ్వరరావు, జీజే ఆనందరావు, జె.జ్ఞానదేవ్‌లను కాకినాడ జిల్లాకు కేటాయించారు. ఎం.వెంకటేశ్వరరావును ఆయన పనిచేస్తున్న ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ విజయవాడకు కేటాయించారు. వీరి ఎస్ఐల ప్రదోన్నతి తక్షణం అమలులోకి వచ్చిందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## జాకీలతో ఇల్లును మూడు అడుగుల ఎత్తు లేపారు


జాకీలతో పైకిలేపిన ఇల్లు

ఆకివీడు, మే 31: నేటి సమాజంలో తల్లిదండ్రుల కంటే ఆస్తులకే ప్రాధాన్యతో ఇస్తున్న రోజుల్లో తండ్రి కట్టిన ఇంటిని కూల్చడం ఇష్టం లేక జాకీలతో పైకిలేపి ఇల్లు కడుతున్నాడు కుమారుడు. దుంపగడపలో తాపీమేస్త్రిగా పనిచేస్తున్న పిల్లా సోమేశ్వరరావు (శివ) తన తల్లిదండ్రులు రెండు స్నర సెంటుల్లో నిర్మించిన ముప్పై ఏళ్ల నాటి ఇంటిని మూడు అడుగులు పైకెత్తి నిర్మాణం చేపట్టారు. స్లాబ్ ఏరియా ప్రకారం అడుగుకు రూ.100 లెక్కన 650 అడుగులలో జాకీలతో పైకి లేపారు. జాకీలతో పైకిలేపే సమయంలో ఇంట్లోని వస్తువులు తీయ నవసరంలేదు. భవనానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా బిహార్‌కు చెందిన నిపుణులు సుమారు ఇ రవై ఐదు రోజుల్లో పునాదుల్లోని బీములకు జాకీలుపెట్టి పైకిలేపే ప్రక్రియను పూర్తి చేశారు. తల్లిదండ్రులు నిర్మించిన భవనం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఇంటి ఎత్తు పెంచేందుకు శివ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కింద నుంచి ఇటుకలతో కట్టుబడి కడుతూ జాకీలను తొలగించుకుంటూ వస్తున్నారు. ఈ నిర్మాణాన్ని గ్రామస్థులు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

## క్రైం సమాచారం

### మనస్తాపంతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 31 :అప్పులవాళ్ళు తన ఆటోను దౌర్జన్యంగా తీసుకువెళ్ళిపోయారని మనస్తాపం చెందిన ఓ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్ ఆత్మహత్య గురువారం రాత్రి నగర శివారులో చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఏలూరు రూరల్ పరిధిలో మాదేపల్లి పంచాయతీ లింగారావుగూడెంకు చెందిన పాకుర్ల వెంకన్నబాబు(33)కు భార్య సారమ్మ, ముగ్గురు పిల్లలున్నారు. ఓ ఆటో కొనుక్కుని నడుపుతూ కొంతకాలంగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం ఏలూరుకు చెందిన ఓ వడ్డీ వ్యాపారి హన్నా అనే వ్యక్తి వద్ద రూ.40 వేలను నెల రోజుల క్రితం అప్పుగా తీసుకున్నాడు. ఆ బాకీ తీర్చకపోవడంతో గురువారం సాయంత్రం హన్నా మరో వ్యక్తితో కలిసి అతడి బాకీ నిమిత్తం ఆటోను బలవంతంగా తీసుకువెళ్లాడు. ఈ పరిణామంతో మనస్తాపానికి గురై కిడ్నీ రాళ్ల కరిగేందుకు ఉపయోగించే మాత్రలను అధిక మోతాదులో వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆటో తీసుకువెళ్ళిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

లారీలో నిద్రిస్తున్న ఒక క్లీనర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నెల్లూరు జిల్లా ఇందుకూరికోటకు చెందిన తలారి శ్రీనివాసరావు(40) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డు వద్ద లారీని డ్రైవర్ మే 30వ తేదీన పార్కు చేయగా క్లీనర్ నిద్రించాడు. డ్రైవర్ వచ్చి చూసే టప్పటికి మృతి చెందాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసు పత్రిలో శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

ఒంటరిగా జీవిస్తున్న ఒక యువకుడు మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఆదివారపుపేట మసీదు రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ రెహమాన్ (21)కి వివాహం కాలేదు. మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మరణించగా అమ్మమ్మ వద్దే ఉంటూ ఒక షోరూమ్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు మరణించడం, కొద్ది నెలల క్రితం అమ్మమ్మ మరణించడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటూ ఆందోళనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శుక్రవారం రెహమాన్ మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

### గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒక గుర్తు తెలియని యువకుడు జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి దగ్గరలోని రైల్వే బ్రిడ్జిపై 16వ నంబరు జాతీయ రహదారిపై సుమారు 35 ఏళ్ల వయస్సు గల యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరురూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి తెలియ డంతో సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడి మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నాడు. ఫ్యాంట్, షర్టు ధరించి ఉన్నాడు. చెవిపోగులు ఉన్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రూరల్ ఎస్ఐ 94407 96636 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

### భీమవరంలో మరొకరు..

భీమవరం క్రైం, మే 31 : భీమవరం టూటౌన్ ఏరియాలోని రైల్వే టన్నెల్ దగ్గరలో డీ-మార్ట్ సమీపంలో సుమారుగా 35-40 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ వ్యక్తి ముక్కుపొడుం రంగు ఫ్యాంట్, నీలం రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిపిన వారుగాని, అతడి బంధువులు ఎవరైనా గుర్తుపడితే భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ 08816-223653, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ 94407 96634 నంబర్లకు తెలపాలన్నారు.


## ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.47 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వరరావు

తణుకు, మే 31 : తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీలు చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం తణుకు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని తణుకు అజ్జరం రోడ్డులో నిందితులైన భీమవరం పట్టణానికి చెందిన పందిరి వెంకటనారాయణ, తణుకు పట్టణానికి చెందిన నగరపు ఈశ్వరరావులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.47 లక్షల విలువైన 600 గ్రాములు బంగారం ఆభరణాలుతో పాటు 13 కిలోల వెండి వస్తువులు, రెండు మోటారు సైకిల్‌లు స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్తుడైన పందిరి వెంకటనారాయణకు హత్య కేసులో జైలుకు వచ్చిన ఈశ్వరరావుతో పరిచయం ఏర్పడిందన్నారు. గత ఆరు నెలల వ్యవధిలో పదిహేను నేరాలకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ. కె.చంద్రశేఖర్, ఇరగవరం ఎస్ఐ డి.ఆదినారాయణ పాల్గొన్నారు. కేసులో సహకరించిన సిబ్బంది ఎం.యల్లారావు, షేక్ అన్వర్, మలక శ్రీనివాసు, ఎం.నాగశ్రీనివాసు, ఎం.లక్ష్మణరావు, కె.రుద్రేశ్వరరావులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అభినందించారు.

## తెరుచుకోని వేండ్ర రైల్వే గేటు.. తప్పని ఇక్కట్లు


మూసుకుపోయిన రైల్వే గేటు

పాలకోడేరు, మే 31 :వేండ్ర రైల్వే గేటు తెరచుకోకపోవడంతో శుక్రవారం సాయంత్రం అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు ఐదు గంటల సమయంలో రైలు రావడంతో రైల్వేగేటును సిబ్బంది వేశారు. రైలు వెళ్లిన అనంతరం ఒక వైపు గేటు తెరుచుకోగా మరోవైపు ఉన్న గేటు తెరుచుకోకపోవడంతో పాలకోడేరు నుంచి వేండ్ర వైపు వెళ్లే వాహనదారులు, భీమవరం వచ్చే ప్రయాణికులు అరగంటపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు గేటులో నుంచి వంగి ప్రయాణాలు సాగించారు. కొద్ది సేపటికి రైల్వే అధికారులు మరమ్మతులు చేయడంతో గేటు తెరుచుకుంది. భారీ వాహనాలు అటుగా ప్రయాణం సాగించాయి.

## కోలుకుంటున్న హంతకుడు

ఏలూరు క్రైం, మే 31 : తనకు దక్కనిది మరెవరికి దక్కనివ్వనని ప్రేమోన్మోది తన మనస్సులో గట్టిగా నూరిపోసుకుని తన స్నేహితురాలిని నడిరోడ్డుపై నరికి హతమార్చిన హంతకుడు ప్రస్తుతం విజయవాడ ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. ముసునూరుకు చెందిన కట్టిబోయిన ఏసురత్నం (23) ఏలూరు సత్రంపాడులో ఉన్న ఒక డిగ్రీ కాలేజీలో చదువుతున్న రోజుల్లో తన క్లాస్‌మేట్ అయిన ఏలూరు ఎమ్మార్సీ కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్‌తో చనువుగా ఉండేవాడు. తనను పెళ్లి చేసుకోవాలని ఆమెను వేధించాడు. ఆమె నిరాకరించడంతో మే 30వ తేదీ మధ్యాహ్నం సత్రంపాడు సెంటర్ వద్ద ఆమెతో మాట్లాడే పని ఉందంటూ నమ్మకంగా ఒక వీధిలోకి తీసుకువెళ్లి తనను పెళ్ళి చేసుకోవాలని మరోసారి కోరాడు. నిరాకరించడంతో వెంటనే కత్తితో ఆమెను నరికి తన మెడ కోసుకున్నాడు. ఆమె మరణించింది. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఏసురత్నంను తరలించగా అతడి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో అక్కడ వైద్యులు గురువారం రాత్రి కంఠానికి ఆపరేషన్ నిర్వహించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని స్పృహలోనే ఉన్నాడని వైద్యులు ధ్రువీకరించారు. ఏసురత్నం సైగలతో మాత్రమే ఎదుటివాకి చెప్తున్నాడని ఆమె ఎలా ఉందని బతికిందా చనిపోయిందా అంటూ సైగల ద్వారా అడుగుతున్నాడని ఆసుపత్రి వర్గాలు తెలియజేశాయి. మొత్తం మీద హంతకుడు కోలుకుంటున్నాడు. అతడిపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యా కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేశారు. ముందస్తుగా ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అతడి వద్ద అనధికార నిఘా ఏర్పాటు చేశారు.

## విద్యుత్ కోతలతో ఇక్కట్లు

5వ పేజీ తరువాయి

ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఇవి మరింత పెరిగాయని చెబుతున్నారు. ఇవి రాత్రి వేళల్లోనూ కొనసాగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎండల సమయంలో కోతల వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరగడం లేదు. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత పెరగటంతో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రజలు ఏసీలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌ల వినియోగం బాగా పెరిగింది. ఈ కారణంగా విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఓవర్ లోడ్ కారణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ వేసవిలో ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పంట కాల్వలు శుభ్రం

నరసాపురం రూరల్, మే 31: గుర్రపు డెక్క,తూడులతో నిండిపోయిన పంట కాల్వలను ఉపాధి హామీ పథకం ద్వారా శుభ్రం చేస్తున్నారు. వేములదీవి, రామన్నపాలెం, శేరేపాలెం కాల్వలతో పాటు పూడుకు పోయిన పంట బోదెలను కార్మికులు డెక్క, తూడులను తొలగిస్తున్నారు. మండలంలో సుమారు 1800 మంది కార్మికులు చెరువుల పూడిక, కాల్వలను ఆధునీకరణ, బోదెలను శుభ్రం చేస్తున్నారు.

## నేడు శ్రీవారి అన్నసమారాధన

కాళ్ల(ఉండి), మే 31: శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని జూన్ 1వ తేదీ శనివారం ఉదయం నుంచి శ్రీస్వామివారి ఆలయం వెనుక గల స్వామివారి తోటలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఈవో ఎం.అరుణకుమార్ తెలిపారు.

## కల్వర్టులు ఏర్పాటు చేయాలి

నరసాపురం రూరల్, మే 31: మండలంలోని లక్ష్మణేశ్వరం నుంచి వేములదీవి వరకు సుమారు రూ.20కోట్లతో చేపట్టిన ఆర్అండ్‌బి రహదారి పనులు మధ్యస్థంగా నిలిచిపోయాయి. అనేక గ్రామాల్లో సీసీ రహదారి వేసినా మధ్య మార్గంలో మాత్రం కల్వర్టులు ఏర్పాటు చేయలేదు. ఈకారణంగా తీర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తు, పల్లపు రహదారి కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిని పూర్తి స్థాయిలో నిర్మించాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు.

## ముందస్తు సార్వాకు సిద్ధం కావాలి

నరసాపురం రూరల్, మే 31: పంట కాల్వలకు నీటి సరఫరా కాగానే రైతులు ముందస్తు సార్వాకు సిద్ధం కావాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి సూచించారు. అన్ని కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నందున రైతులు విత్తన శుద్ధి చేసిన తరువాత నాట్లు వేయాలన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు, తుఫాన్‌లు ఉండే అవకాశం ఉన్నందున చేతికొచ్చిన పంటను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున రైతులు ఆలస్యం చేయకుండా సాగుకు ఉపక్రమించాలన్నారు.

## తాగునీటి కోసం కటకట

నరసాపురం రూరల్, మే 31: తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు కటకటలాడిపోతున్నారు. రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేయడం, అది కూడా తక్కువ సమయం రావడంతో ప్రజలకు నీరు సరిపోలేని పరిస్థితి నెలకొంది. ఈకారణంగా చాలా మంది టౌన్ వాటర్ వర్క్స్, లేదా ఆర్వో ప్లాంట్ ద్వారా తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి నీటి సరఫరా ఎక్కువ సమయం ఉండేలా చూడాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## 'గెలుపుపై వైసీపీ పగటి కలలు'



నరసాపురం, మే 31: రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని వైసీపీ పగటి కలలు కంటుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ సర్వేలతో ప్రజల్ని వైసీపీ మభ్యపెడుతుందన్నారు. 4న 10గంటల కల్లా ఆపార్టీకి ప్రజలు ఓటుతో ఏవిధంగా బుద్ధి చెప్పారో అర్థమవుతుందన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుస్తారన్నారు. ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు 2లక్షపైనే మెజార్టీ వస్తుందన్నారు. క్రాస్ ఓటింగ్‌పై వైసీపీ కంటున్న కలలన్నీ ఫలితాలతో అడియాశలవుతాయన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత నియోజకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామ,వార్డు స్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈసమావేశంలో అన్నపూర్ణ, పండు, మునికోటి వెంకటేశ్వరావు, దిలీప్, కె శ్రీనులు పాల్గొన్నారు.

## కౌంటింగ్ రోజున ఆంక్షలు పాటించాలి: బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, మే 31: జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజున పోలీసుల ఆంక్షల ప్రకారం నడుచుకోవాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని ప్రత్యర్థి కవ్వింపు చర్యలకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఎవరూ స్పందించవద్దన్నారు. గెలుపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం విరుద్ధమన్నారు. నాయకులు, కార్యకర్తలకు అందరూ సంయమనం పాటించి క్రమశిక్షణతో ఉండాలని సూచించారు.



## తణుకు కరాటే విద్యార్థుల ప్రతిభ

తణుకు, మే 31: తణుకు కేఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు మే 23, 24, 25 తేదీల్లో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్టు కోచ్ కేతా శ్రీనివాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ కేటగిరీలలో కటా విభాగంలో కె.అక్షయ్, జె.వైష్ణవి, తమోగ్నేష్, రుత్విక్ శ్రీరామ్, వైష్ణావని, తేజ్ కార్తికేయ, రూత్విక్, జూనియర్ కేటగిరిలో కె.లలిత, దేదీప్య, షర్మిల రాణి, నాగపండు, సిద్ధార్థ బంగారు పతకాలు సాధించారని తెలిపారు.

## 'సజ్జలను పోలీస్ కస్టడీకి తీసుకోవాలి'

ఆకివీడు, మే 31: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సమయంలో వైసీపీ ఏజెంట్లు రూల్స్ పాటించనక్కర్లేదు, మీ వెనుక మేముంటాం అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకొని కఠిన చర్యలు చేపట్టాలని టీడీపీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందచేసి మాట్లాడారు. అధికార పార్టీ కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం వలన ఇతర పార్టీ ప్రతినిధులు భయందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, అజ్మల్, మోపిదేవి శ్రీను, జాకీర్, కిమిడి నాగరాజు, దూబ సురేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

## 5 నుంచి 7 వరకు విత్తన విక్రయాలు

పెనుమంట్ర, మే 31 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధ స్థానంలో ఈనెల 5,6,7వ తేదీల్లో రైతులకు విత్తనాలు విక్రయిస్తామని మార్టేరు వ్యవసాయ సంస్థ ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్, వరి ప్రథమ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన సంస్థలో పడిపోని స్వర్ణగా పేరొందిన ఎంటీయూ 1318 (ఫౌండేషన్, సత్య ప్రమాణ విత్తనాలు) 1500 క్వింటాళ్లు కావలసిన మేరకు సరఫరా చేస్తామన్నారు. ఎంటీయూ 1318 (ఫౌండేషన్ విత్తనం) 25 కేజీల బస్తా ధర రూ.వెయ్యి, ఎంటీయూ 1318 (సత్య ప్రమాణ విత్తనం) 25 కేజీల బస్తా ధర రూ.950కు విశ్వవిద్యాలయం నిర్ణయించింది. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా పడిపోని 150 రోజుల కాలపరిమితి కలిగిన, తక్కువ నత్రజనితో, స్వర్ణ కన్నా పది శాతం అధిక దిగుబడి, మిల్లర్లకు, మార్కెట్‌కు అనువైన ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేయాలని సూచించారు.



ఆకివీడులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది.. గణపవరం, పాలకోడేరులలో ర్యాలీ..

# ధూమపానంతో అనర్థాలు

**జిల్లా అంతటా ధూమపాన వ్యతిరేక ర్యాలీలు**

పాలకోడేరు, మే 31: ధూమపానంతో మనుషుల ప్రాణాలకే ముప్పని అటువంటి ధూమపానానికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ. రంగం నాయుడు అన్నారు. టొబాకో వ్యతిరేక దినం సందర్భంగా పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని మాట్లాడుతూ ధూమపానం చేసేవారికే కాకుండా పక్కనుండి ఆ గాలి పీల్చిన వారికి కూడా లంగ్ క్యాన్సర్, టీబీ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాగే గుట్కాలు, ఖైనీలకు దూరంగా ఉన్నప్పుడే ఆరోగ్యాలు భద్రంగా ఉంటాయన్నారు. సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు అమ్మాజీ, శంకర్ పాల్గొన్నారు.

**ఆకివీడు:** పొగాకు మానుకోని..ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటపతిరాజు అన్నారు. ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినం సందర్భంగా స్థానిక యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ధూమపానం వలన ఆరోగ్య పరిస్థితి దిగజారడమే కాకుండా క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడతారన్నారు. యువతీ యువకులు ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆశాబీ బేగం, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీలో కూడా అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

**ఉండి:** పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డా.సాయిచంద్ర, డా.సునంద అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు నివారణ దినం పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు.

**కాళ్ల(ఉండి):** ధూమపానంతో ఆరోగ్యం పాడవుతుందని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డా.సునీల్, డా.సునీత అన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పొగాకు తీసుకోవడం వలన కలుగు నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో డి.విజయావతి, ఎంపీహెచ్ఈవో పాల్‌సన్, హెచ్‌వీలు పరంజ్యోతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గణపవరం:** పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల శరీరంలో ప్రతీ అవయవం పాడై జీవితాన్ని నాశనం చేస్తుందని గణపవరం ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి అన్నారు. గణపవరం పీహెచ్‌సీ, పిప్పర పీహెచ్‌సీ, సీహెచ్.అగ్రహారం, కాశీపాడు గ్రామాల్లో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం పీహెచ్‌సీలో పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కాశిపాడులో జరిగిన ర్యాలీలో పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల పీఎంపీల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్.అగ్రహారంలో జరిగిన ర్యాలీలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

**అత్తిలి:** ధూమపానం వల్ల అనారోగ్యం పాలవుతారని మంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కిరణ్ అన్నారు. శుక్రవారం సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. పొగాకు వాడకం మనిషిలో గల అంతర్గత అవయవ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఎంపీడీవో కె శాంతమూర్తి, ఎంపీహెచ్ ఎస్ఎం ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** పొగాకు వాడకం వల్ల పలు సమస్యలు వస్తాయని అందువల్ల పొగాకుకు దూరంగా ఉండాలని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో గురువారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

**పాలకొల్లు రూరల్:** పొగతాగడం మానండి క్యాన్సర్ నుంచి రక్షణ పొందండని లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్ అన్నారు. దగ్గులూరు సచివాలయంలో శుక్రవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో డాక్టర్ ప్రతాప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల నోటీ క్యాన్సర్, ఊపిరి తిత్తుల క్యాన్సర్, గుండెకి ఆక్సిజన్ సరఫరా తగ్గి గుండె పోటు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అందువల్ల ధూమపానం మానాలని సూచించారు.

## లెక్కింపు కేంద్రానికి రావటానికి ప్రణాళిక ఉండాలి: కలెక్టర్

భీమవరం టౌన్, మే 31 : కౌంటింగ్ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు సులువుగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సంయుక్తంగా రిటర్నింగ్ అధికారులు, ఎస్డీపీవోలతో సమావేశమై కౌంటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి రూట్ మ్యాప్‌లను రూపొందించి, పార్కింగ్ ప్రదేశాల సమాచారాన్ని అందించాలన్నారు. పార్కింగ్, కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలపై కౌంటింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కొవ్వాడ అన్నవరం సెంటర్ కు చేరుకున్న కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లుకు విష్ణు కాలేజీ మెయిన్ గేటు వరకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మీడియా ప్రతినిధులు కూడా ఇదే వాహనాల్లో మీడియా సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి నాగరాజు మాల్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా ప్రదేశాల నుంచి నడిచి వచ్చిన కూడా 7,8 నిమిషాలు మాత్రమే పడుతుందన్నారు. లేనిపక్షంలో బస్సులు ద్వారా ఎస్ ఆర్ కే ఆర్ కళాశాల మెయిన్ గేటు వద్దకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.



## చిన్నారులకు కూచిపూడి నృత్య శిక్షణ

ఆకివీడు, మే 31: భారతీయ సంప్రదాయ నృత్యం కూచిపూడి వైభవమని ఆమని నృత్య కళా నిలయం శిక్షకురాలు చాగంటిపాటి మౌనిక రాజశేఖర్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక ఐఎంఏ హాల్‌లో ఇరవై ఒక్కరోజు చిన్నారులకు శిక్షణ ఇచ్చి శుక్రవారం ప్రశంసా పత్రాలు అందచేసి మాట్లాడారు. భారతదేశం శాస్త్రీయ నాట్యాలకు పుట్టినిల్లు అని, మన దేశంలో భరతనాట్యం ప్రసిద్ధి గాంచిన శాస్త్రీయ నృత్యం అన్నారు. వేసవిలో చిన్నారులు సమయాన్ని వృధా చేయకుండా ఇటువంటి నృత్యాలు నేర్చుకోవడం మంచిదన్నారు.

## నేడు హనుమద్ కల్యాణం

ఆకివీడు, మే 31: ఆకివీడు ఆనాల చెరువు గట్టున భక్తాంజనేయస్వామి జయంతి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. లక్ష్మీగణపతి, మన్యుపాశుపతి హోమం, తీర్థ ప్రసాదాలు అందచేశారు. శనివారం హనుమ జయంతి సందర్భంగా కళ్యాణ మహోత్సవం, అఖండ అన్నసమారాధన జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

## రాష్ట్రంలో కూటమిదే అధికారం:రవివర్మ



ఆకివీడు, మే 31: ఏపీలో తెలుగుదేశం కూటమిదే అధికారమని జ్యోతిష్య పండితులు పిన్నమరాజు రవివర్మ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన రవివర్మ సొంత గ్రామమైన దుంపగడపకు వచ్చిన ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. 2014లో తాను చెప్పినట్టుగా చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నదని, 2019లో జగన్ సీఎం అవుతారని తాను చెప్పినట్లు గుర్తు చేశారు. జూన్ 4న ఫలితాల్లో కూటమి అత్యధిక స్థానాలు సాధిస్తుందన్నారు.

## కాలిపోయిన విద్యుత్ మీటర్

ఆకివీడు, మే 31: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సమతానగర్‌లోని మారేపల్లి దానమ్మ ఇంట్లో మీటర్ శుక్రవారం కాలింది. రూ.5వేలు నష్టం వాటిల్లిందని అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

## సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



అంజలి స్కూల్లో కేక్ కట్‌చేస్తున్న కృష్ణ మహేష్‌బాబు యువసేన సభ్యులు

పాలకొల్లు టౌన్, మే 31: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను పాలకొల్లు అంజలి మానసిక వికలాంగుల స్కూల్‌లో శుక్రవారం కృష్ణ మహేష్‌బాబు యువసేన సభ్యులు ఘనంగా నిర్వహించారు. మానసిక వికలాంగుల మధ్య కేక్ కట్‌చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు కోరాడ శ్రీనివాస్, గుమ్మాపు సూర్యవరప్రసాద్, ధనాని సూర్యప్రకాష్, ప్రెసిడెంట్ తలుకూరి భుజంగరావు, సత్యశ్రీను, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

అత్తిలి, మే 31 : అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు ఆకర్షితులయ్యే విధంగా పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుజాత రాణి అన్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తిరుపతిపురంలో గల అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అదే విధంగా కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆయా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, ఉన్నారు.

## 6వ తేదీ వరకు 144 సెక్షన్

తాడేపల్లిగూడెం రూరల్, మే 31: ఎన్నికల నిబంధనల మేరకు జూన్ 6వ తేదీ వరకూ 144 సెక్షన్ కొనసాగుతుందని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీంతో నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపుగా ఉండరాదని, సమావేశాలు పెట్టరాదని తెలిపారు. లెక్కింపు అనంతరం బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గెలిచిన పార్టీ వాళ్లు ఓడిన పార్టీ వారిని హేళన చేయడం, వాట్సప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేయడం, రాజకీయ నాయకులను విమర్శించడం చేయరాదని హెచ్చరించారు. ప్రజలంతా ఈ నిబంధనలకు సహకరించాలని కోరారు.

## హనుమాన్ ఉత్సవాలకు ఏర్పాట్లు

మొగల్తూరు, మే 31: హనుమాన్ జయంతి సందర్భంగా వేకువ జాము నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు భక్తులు సామూహికంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. మొగల్తూరులోని పురాతన ఆంజనేయస్వామి ఆలయం, పేరుపాలెంలోని 54 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయం, ముత్యాలపల్లి, కాళీపట్నంలోని 24 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

## పచ్చిరొట్ట పెంపకంతో ప్రయోజనాలు

మొగల్తూరు, మే 31: వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట పెంపకం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినుము, పిల్లి పెసర, జీలుగ పెంపకం ద్వారా నేలలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. రానున్న సార్వా సాగుకు జీలుగు పెంపకం ద్వారా నత్రజని శాతంపెరిగి నిద్రావస్థ నుంచి చేలను కాపాడుతుందన్నారు. ఎకరాకు జనుము 16 కిలోలు, జీలుగ 24 కేజీలు వాడితే మంచి పోషకాలు అందుతాయన్నారు. రైతులంతా తమ వ్యవసాయ భూముల్లో పచ్చి రొట్టను పెంచితే భూసారం పెరిగి అధిక దిగుబడిలు వస్తాయన్నారు.

## ఉప సర్పంచ్ ఫణీంద్ర మృతి



ఆచంట, మే 31: భీమలాపురం ఉపసర్పంచ్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు జడ్డు శివ నాగ ఫణీంద్ర (50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా ఫణీంద్ర అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం ఇంటికి వచ్చారు. ఈ తరుణంలో ఫణీంద్ర ఇంటి వద్దే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫణీంద్ర మృతి పట్ల గ్రామ సర్పంచ్ గుబ్బల మాధవ రావు, జనసేన పార్టీ నాయకులు యర్రగొప్పుల నాగరాజు, జవ్వాది బాలాజీ, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## కేపీపాలెం నార్త్‌లో పంటబోదె తవ్వకాలు



మొగల్తూరు, మే 31: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంట బోదె తవ్వకాలు చురుగ్గా జరుగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపారు. అధికారుల ఆదేశాల మేరకు పంట నీరు వృథా కాకుండా ఉండేందుకు కెపిపాలెం, పేరుపాలెం గ్రామాల్లో తోటలకు నీరందించే పంటబోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

## కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

అత్తిలి, మే 31 : కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అంగన్వాడీ కార్యకర్త నీతిపూడి వెంకటలక్ష్మి అన్నారు. ఉరదాళ్లపాలెంలో శుక్రవారం రుతుక్రమంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. రుతుక్ర మ సమయంలో మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగజ్యోతి, రాధ, కిషోర్ బాలికలు పాల్గొన్నారు. కేఎస్ గట్టులో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో రుతుక్రమంపై సూపర్‌వైజర్ కె కుమారి అవగాహన కల్పించారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి సుజాతరాణి అన్నారు. తిరుపతిపురంలో రుతుక్రమ పరిశుభ్రతపై అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సులు నిర్వహించారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** మహిళలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తాడేపల్లిగూడెం సీడీపీవో సరస్వతి సూచించారు. యాగర్లపల్లి యూహెచ్‌సీ పరిధిలో కిశోర బాలికలకు రుతుక్రమంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చెయ్యటం నేరం

భీమవరం టౌన్, మే 31: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియట్ అథారిటీ అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో డిఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో పీసీపీఎన్ డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశం డాక్టర్ కె భాను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉందా లేదా ఏమైనా అంగవైకల్యాలు ఉందా అని మాత్రమే స్కానింగ్ ద్వారా చెక్ చేయాలని సూచించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ గడువు తేదీకి నెల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు డయాగ్నొస్టిక్ ఇమేజింగ్ ఫెర్టిలిటా సెంటర్లు స్కానింగ్ మిషన్ల ద్వారా లింగ నిర్ధారణ సంబంధించి ఎలాంటి స్కానింగ్ చేయబోమని ఆసుపత్రిలో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## సత్యవరప్రసాద్ ఉద్యోగ విరమణ సత్కారం



భీమవరం, మే 31 :ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటేనే తగిన గుర్తింపు లభిస్తుందని, సీనియరు ఉద్యోగుల నుంచి ప్రతి విషయాన్ని అవగతం చేసుకోవాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ తోట లీలా శంకర్ సత్య వరప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరయ్యారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో టైపిస్టుగా జాయిన్ అయ్యి వివిధ హోదాలలో పనిచేసి తహసీల్దారు హోదాలో జిల్లా కలెక్టరేటు కార్యాలయం కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా వరప్రసాద్ పని చేశారు. జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్, జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ తదితరులు శుక్రవారం వరప్రసాద్‌ను సత్కరించారు.

## శాంతి భద్రతలు పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

భీమవరం టౌన్, మే 31 : శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని, వచ్చేనెల 4న కౌంటింగ్ రోజున ప్రతి ఒక్కరూ శాంతి సమన్వయం పాటించాలని ఎన్నికల అదనపు రిటర్నింగ్ అధికారిణి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదివ్య అన్నారు. స్వీప్ యాక్టివిటీస్ కార్యక్రమంలో భాగంగా కౌంటింగ్ రోజున శాంతిని పాటించాలని ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదివ్య మాట్లాడుతూ ఎన్నికలు జరగడానికి అందరూ ఎంతో సహకారం అందించారని, కౌంటింగ్ రోజున కూడా ఇదే సహకారం అవసరమని అన్నారు. స్వీప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అనునిత్యం శాంతిగా ఉన్నప్పుడే సమాజం శాంతి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు, నరహరి శెట్టి కృష్ణ, రోటరీ క్లబ్ సభ్యులు బాబాజీ సాహెబ్‌లు శాంతి సహనం సమన్వయం పై వివరించారు.

## వీరయ్య చౌదరి దంపతులకు సత్కారం



వీరయ్యచౌదరి దంపతులను సత్కరిస్తున్న ఈడీ గోపీనాథ్‌రెడ్డి, తదితరులు

భీమవరం టౌన్, మే 31 : జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి ఉద్యోగ విరమణ చేశారు. దీనితో ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేస్తున్న ఎన్‌వీఆర్ వరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. భీమవరం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆయన వీరయ్య చౌదరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన వీరయ్య చౌదరి దంపతులను విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.గోపీనాథ్ రెడ్డి, ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్లు, అసోసియేషన్ నాయకులు తదితరులు వీరయ్య చౌదరిని ఘనంగా సత్కరించారు.

## మిడ్‌డే మీల్స్‌లో వేల్పూరు స్కూలుకు ప్రథమ స్థానం



అవార్డు అందుకున్న హెచ్ఎం రాకడ మణి

తణుకు, మే 31: తణుకు జడ్పీ హైస్కూలులో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన తయారీ పోటీలు నిర్వహించారు. పోటీలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు. పోటీలలో వేల్పూరు ఉన్నత పాఠశాలకు చెందిన భోజన నిర్వాహకులు ప్రథమ స్థానంలో నిలవగా ఆ పాఠశాల హెచ్ఎం రాకడ మణి అవార్డును అందుకున్నారు. మండల విద్యాశాఖాధికారులు ఆమెను అభినందించారు.

## మరలా మొదలైన సందడి....

ఆచంట, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గరపడుతుండటంతో మరలా అన్ని చోట్లా సందడి మొదలైంది. ఎన్నికల ముందు ఆయా గ్రామాల్లో ఎటువంటి సందడి ఉందో మరలా అదే సందడి మొదలైంది. మరో మూడు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వస్తున్న దృష్ట్యా ఆయా రాజకీయ పార్టీల్లోనూ ప్రజల్లోనూ మరలా ఒక్కటే టెన్షన్ నెలకొంది. మరోసారి ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను లెక్కలు వేస్తూ ఫలితాలపై మరోసారి నేతలు లెక్కలు వేసే పనిలో ఉన్నారు. మరలా ఎక్కడ చూసినా వాహనాల రద్దీ ఏర్పడింది. అలాగే అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లను ఎంపిక చేసే పనిలో కూడా నిమగ్నమైయున్నారు. అలాగే ఎన్నికల ఫలితాలుపై కూడా బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో ఎన్నికల ఫలితాలుపై పెద్ద ఎత్తున బెట్టింగ్‌లుజరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.